సమ సమాజ స్థాపనలో భాగస్వాములవుదాం

- జిల్లా కోర్టు న్యాయమూర్తి నరేష్
- వాడవాడలా అంబేడ్కర్ జయంత్యుత్సవం
- ఘనంగా నివాళులర్పించిన నాయకులు, అధికారులు, దళిత సంఘాల నేతలు


ముమ్మిడివరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ తదితరులు


అల్లవరం మండలంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అమలాపురం టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, న్యాయవాదులు, అధికారులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు మనమంతా పాటుపడి సమ సమాజ స్థాపనంలో భాగస్వామ్యం అవుదామని అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో జిల్లా న్యాయమూర్తి నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి హిమబిందు, స్పెషల్ మెజిస్ట్రేట్ పులిదిండి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. సావరంలోని అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కముజు రమణ, వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం శాంతి నగర్‌లో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావు తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. జిల్లా దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, దివ్యాంగ సంఘ నాయకులు సంపత్‌కుమార్, నిమ్మకాయల సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ముస్లింల నివాళులు

స్థానిక మద్దాల వారిపేటలో గల అంబేడ్కర్ విగ్రహానికి పట్టణంలోని ముస్లిం నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బషీర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, స్థానిక కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

అల్లవరం మండలంలో..

అల్లవరం: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పినిపే శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కోడూరుపాడు సెంటర్లో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. గోడిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కొమరగిరిపట్నంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, దేవగుప్తంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ వడ్డి గంగ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

అల్లవరం: మొగళ్లమూరు, శిరగట్లపల్లి, తూర్పుచెరువు ప్రాంతాల్లో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో మాజీ ఎంపీ చింతా అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి అనురాధ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా రూరల్‌లో భట్నవెల్లి హైటెక్ కాలనీ, ఈదరపల్లి బొంతువారిపేట, ఇందుపల్లిలో అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ బాబ్జి రాజు నివాళులర్పించారు. నడిపూడిలో డాక్టర్ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాలు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి విద్యుత్ శాఖ అధికారులు అంబేడ్కర్‌కు నివాళిలర్పించారు. కామనగరువు, సవరప్పాలెంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఔన్నత్యాన్ని చాటిన వైఎస్ జగన్

ఉప్పలగుప్తం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసి దేశం గర్వించేలా అంబేడ్కర్ ఔన్నత్యాన్ని చాటారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా భీమనపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ, ఎంపీటీసీ సభ్యులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యుదయ ప్రదాత అంబేడ్కర్

ముమ్మిడివరం: అభ్యుదయ ప్రదాత అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ అన్నారు. ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ నగర పంచాయతీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ టీడీపీ కార్యాలయంతోపాటు పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంత్యుత్సవంలో పాల్గొన్నారు. అయినాపురం, అనాతవరం, కాశివానితూము, అన్నంపల్లి, గాడిలంక, కర్రివానిరేవు, కొత్తలంక, చినకొత్తలంక, కొమానపల్లిలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చైతన్య యూత్ వెల్ఫేర్, నగర పంచాయతీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని కాట్రేనికోన ఎంపీపీ కొల్లాటి సత్యవతి అన్నారు. కాట్రేనికోన గేటు సెంటరులో మాల మహానాడు సీనియర్ నాయకుడు నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కోలాటి సత్యవతి, నాగిడి నాగేశ్వరావు తదితరులు అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. పల్లంకుర్రులో సర్పంచి నాతి అలివేణి, కందికుప్పలో సర్పంచి చల్లగల వెంకటలక్ష్మి, పి లక్ష్మివాడ బీర సత్యనారాయణలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

కేశనకుర్రుపాలెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం పంచాయతీ పరిధి చింతలమెరకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. దళిత నాయకుల ఆధ్వర్యంలో మురమళ్ల మార్కెట్ సెంటర్‌లో, కేశనకుర్రు, తిళ్లకుప్ప, ఐ.పోలవరం, ఎదుర్లంక, టి.కొత్తపల్లి గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెర్ల రాణి మిరియం జ్యోతి, ఐ.పోలవరం, కేశనకుర్రులో జెడ్పీ పాఠశాలలో, పాతయింజరంలో అంబేడ్కర్‌కు ఘన నివాళి అర్పించారు.

సామాజిక ఆస్పత్రి వద్ద..

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆస్పత్రి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తాళ్లరేవు అంబేడ్కర్ భవన్ వద్ద ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు కన్నిడి వెంకటరమణ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

యానాంలో ఉత్సాహంగా వేడుకలు

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం యానాం నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో, గోపాల్‌నగర్‌లో అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్ వద్ద గల భారీ విగ్రహానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, సీఐ అడలరసన్, రిటైర్డ్ ఆర్ఏఓ గిడ్డి బలరామ్, దళిత నాయకులు పాల్గొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక పాతబస్టాండ్ సెంటర్, అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహాలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

ర్యాలీలో కదం తొక్కిన యువత

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని యానాం జైభీమ్ ర్యాలీ ఆర్గనైజింగ్ కమిటీ, బ్లూ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వందలాది మంది యువకులు కదంతొక్కారు. ముందుగా పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

మహోన్నతుడు అంబేడ్కర్


అమలాపురంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, నాయకులు

అమలాపురం టౌన్: భారత జాతిని జాగృతం చేసిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అమలాపురం పట్టణం మద్దాల వారిపేటలో గల అంబేడ్కర్ విగ్రహానికి వారు సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ శ్రీకాంత్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కును కల్పించిన మహనీయుడని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, జెడ్పీటీసీ సభ్యుడు పందరి శ్రీహరి రామగోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపాని బులినాని, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం అమలాపురం నియోజకవర్గానికి కొత్తగా పార్టీ కో ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ శ్రీకాంత్‌ను పార్టీ నాయకులు సత్కరించారు.



యానాం అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద వేర్వేరుగా నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్, మల్లాడి, దళిత సంఘాల నాయకులు


కోడూరుపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ పినిపే శ్రీకాంత్


గోడిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


ముమ్మిడివరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల, ఎంపీ, గంటి హరీష్ మాధుర్, తదితరులు

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


అమలాపురంలో జిల్లా దళిత ఐక్య వేదిక సభలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ డీబీ లోక్

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో కూటమి ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందని, తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆయన స్పష్టం చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో జిల్లా దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభలో డీబీ లోక్ మాట్లాడారు. దళిత వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు మాట్లాడుతూ అన్నదమ్ములుగా ఉండే దళితల మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చుపెడుతోందని అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, మాల మహానాడు నాయకులు ఎంఏకే భీమారావు, గెద్దం సురేషబాబు పాల్గొన్నారు.

ఏఐ కంప్యూటర్ కోర్సులో శిక్షణ అభినందనీయం

ఐ.పోలవరం: గ్రామీణ యువత సాధికారత కల్పించే లక్ష్యంలో భాగంగా కలియుగ పాండవులు శిక్షణ కేంద్రం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) కంప్యూటర్ కోర్సుల్లో యువతకు శిక్షణ నివ్వడం అభినందనీయమని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ అన్నారు. సోమవారం జి.మూలపొలం పంచాయతీ పరిధి యర్రగరువులో న్యాయవాది రేవు అప్పారావు, మంగాదేవి దంపతుల ఆధ్వర్యంలో డాక్టర్ రేవు చినరాజు ప్రోత్సాహంతో ఎన్ఆర్ఐల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన కలియుగ పాండవులు కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాశి షర్మిళ, మండపాటి భైరవస్వామి తదితరులు ఉన్నారు.

నేడు ముత్యాలమ్మ తీర్థం

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామదేవత ముత్యాలమ్మవారి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేసారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఎస్సీ, బీసీ సంఘీయుల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి సుంకర కుటుంబీకుల ఆధ్వర్యంలో అమ్మవారి జాతర నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వెటరన్ క్రీడాకారుడు వీర్రాజు మృతి


బిళ్ల వీర్రాజు (ఫైల్)

అమలాపురం టౌన్: వెటరన్ క్రీడాకారుడు బిళ్ల వీర్రాజు (74) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. ఏడు పదుల వయస్సులోనూ వీర్రాజు 20 లాంగ్ జంప్, హై జంప్, పరుగు పందెంలో సత్తా చాటే వారు. అమలాపురానికి చెందిన వీర్రాజు దేశంలో పలు రాష్ట్రాల్లో నిర్వహించిన వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని అనేక బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. తన క్రీడా ప్రస్థానంలో వీర్రాజు దాదాపు 100కి పైగా వివిధ పతకాలు సాధించారు. చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువతో వెటరన్ క్రీడాకారుడిగా పలు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆయన ఉపాధి కోసం పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశారు. కరోనా తర్వాత ఆరోగ్యం క్షీణించి ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. వీర్రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీర్రాజు మృతి పట్ల స్థానిక చందన బ్రదర్స్ వస్త్రాలయం మేనేజర్ దొంతంశెట్టి శ్రీధర్, పట్టణానికి చెందిన వెటరన్ క్రీడాకారులు మెహబూబ్ సిస్టర్స్ షహీరా, షకీలా సంతాపం తెలిపారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం

అమలాపురం రూరల్: బందారులంక హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనుల కోసం ముక్తిధామ్ ట్రస్టుకు చింతా గాంధీ జ్ఞాపకార్థం వారి సోదరులు అత్తిలింగం శంకరమూర్తి, వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.15వేలు విరాళంగా అందజేశారు. హిందూ శ్మశానవాటికలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా గతంలో చింతా కుటుంబ సభ్యులు రూ. 85వేలు విరాళం అందించారు. దీంతో మొత్తం రూ. లక్ష విరాళాన్ని సమకూర్చారు. చింతా అత్తిలింగం, శంకరమూర్తి కుటుంబ సభ్యులను ముక్తిధామ్ ట్రస్ట్ సభ్యుడు ఉప్పుగంటి భాస్కరరావు అభినందించారు.

అనధికార మద్యం షాపుల నిర్వాహకులపై కేసు

అమలాపురం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో కామనగరువులో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు మండలాల్లో జనవరి 1 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు 39 మంది అనధికార మద్యం షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్టు సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు తెలిపారు. వివిధ కేసుల్లో పాత ముద్దాయిలు 122 మందిని మండల తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


ముమ్మిడివరంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న అధికారి కొండబాబు


అమలాపురం అగ్నిమాపక కేంద్రంలో యంత్రాలు, సామగ్రికి సెల్యూట్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ముమ్మిడివరం: ఏప్రిల్ 14 అగ్రిమాపక దినోత్సవం పురస్కరించుకొని ముమ్మిడివరం అగ్రిమాపక కేంద్రం వద్ద సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను ఘనంగా ప్రారంబించారు. అగ్రిమాపక ఇన్‌చార్జ్ అధికారి కేవీ మురళీ కొండబాబు అగ్నిమాపక పతాకాన్ని ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు, జే.సత్యనారాయణరాజు, కుంచనపల్లి సత్యనారాయణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాలు అమలాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు అధ్యక్షతన మొదలైన ఈ వారోత్సవాలకు జిల్లా అగ్ని మాపక దళాధికారి ఎస్.పార్థసారథి స్థానిక అగ్నిమాపక కేంద్రంలో వారోత్సవాలకు కారణమైన తేదీని, సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ స్మృతి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక యంత్రాలు, పరికరాలకు జిల్లా అధికారి పార్థసారథి, అమలాపురం అధికారి మురళి కొండబాబు, సిబ్బంది సెల్యూట్ చేసి వారోత్సవాల ఆవశ్యతను వివరించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. అగ్ని మాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ


అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదాలను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు 'అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి' అనే నినాదంతో అగ్నిమాపక సేవల వారోత్సవాలను సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రదేశాల్లో జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు, డెమో ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్. పార్థసారథి, అగ్నిమాపక అధికారులు కేవీ మురళి కొండబాబు, పి శ్రీనివాస్, అగ్నిమాపక కేంద్రాల ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగులు మార్గదర్శనం చేయాలి

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనలో ఎస్సీ యువతకు ఎస్సీ ఉద్యోగులు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత ఉందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక పాతబస్టాండ్‌లో యానాం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కలైమామణి, దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, పాము సత్యనారాయణ, పాలికి ప్రకాష్, ఫ్లోరెన్స్, నల్లా కమల, బచ్చుల విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి కుటుంబ కథా చిత్రాన్ని అందించాం

'అక్కడ అమ్మాయి– ఇక్కడ అబ్బాయి' చిత్రం హీరో ప్రదీప్


అమలాపురం శేఖర్ థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య సందడి చేస్తున్న హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక

అమలాపురం టౌన్: స్వగ్రామమైన అమలాపురంలో తాను నటించిన చిత్రం ×అక్కడ అమ్మాయి– ఇక్కడ అబ్బాయి‡ విజయవంతంగా ప్రదర్శితమవడం కళ్లారా చూసి చాలా ఆనందించానని హీరో, బుల్లితెర యాంకర్ మాచిరాజు ప్రదీప్ అన్నారు. అమలాపురంలో ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న శేఖర్ థియేటర్‌కు చిత్ర యూనిట్ సోమవారం రాత్రి వచ్చి సందడి చేసింది. సినిమా చూస్తున్న ప్రేక్షకులతో హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక పిల్లి ముచ్చటించారు. ప్రేక్షకులతో కలిసి హీరో హీరోయిన్లు, చిత్ర దర్శకుడు భరత్ సినిమాను చూశారు. అమలాపురంలో ప్రేక్షకులు సినిమా విజయవంతంపై వారి మాటల్లోనే వింటుంటే చాలా సంతోషంగా ఉందని ప్రదీప్ పేర్కొన్నారు. ఈ వేసవి సెలవుల్లో ప్రేమానురాగాలతో కూడిన మంచి కుటుంబ కథా చిత్రాన్ని అందించామన్న సంతృప్తి మాకు ఉందని ఆయన చెప్పారు. చిత్ర హీరోయిన్ దీపికా పిల్లి మాట్లాడుతూ తమ సొంతూరు విజయవాడ అని, యాంకర్‌గా పనిచేస్తూ హీరోయిన్ అయ్యానని తెలిపారు. శేఖర్ థియేటర్ యాజమాన్య ప్రతినిధి సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వేపచెట్టు దుర్గమ్మకు శాశ్వత గద్దె


అమలాపురంలో వేప చెట్టు కనకదుర్గమ్మకు శాశ్వత గద్దె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో వేంచేసిన వేప చెట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద నూతనంగా నిర్మించనున్న అమ్మవారి శాశ్వత గద్దెకు భక్తులు సోమవారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతానికి చెందిన ఆడపడుచులు సమక్షంలో ఈ శంకుస్థాపన పూజలు చేశారు. శతాబ్దాల చరిత్ర గల ఈ వేప చెట్టు అమ్మవారికి ఏటా శ్రావణ మాసం పౌర్ణమి ముందు వచ్చే గురువారం సంబరాలతో అమ్మవారి గద్దె నుంచి ఊరేగింపు నిర్వహిస్తారు. ఇప్పటి వరకూ అమ్మవారి గద్దెను తాత్కాలికంగా ఏర్పాటు చేసేవారు.త్వరలో అమ్మవారికి శాశ్వత గద్దె నిర్మితమవుతుందని భక్తులు తెలిపారు. వచ్చే శ్రావణ మాసంలో నిర్వహించే ఉత్సవాల నాటికి గద్దె నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కల్వకొలను వీధి పెద్దలు పిండి వెంకయ్య, కల్వకొలను బాబు, బోణం అప్పారావు, బెజవాడ సత్తిబాబు పాల్గొన్నారు.

రీజెన్సీ పరిశ్రమను తెరిచేందుకు సహకరించాలి


సీఎం రంగసామిని కలిసిన జీఎస్ నాయుడు

యానాం: మూతపడ్డ రీజెన్సీ సిరామిక్స్ లిమిటెడ్ భారీ పరిశ్రమను పునఃప్రారంభించేందుకు సహకరించాలని సీఎం రంగసామిని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు కోరారు. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో రంగసామిని కలిసి తమిళ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వపరంగా అన్ని స్థాయిల్లో తీసుకోవాల్సిన చర్యలను నివేదించారు. ముఖ్యంగా యానాంలో రీజెన్సీ సిరామిక్ టైల్స్ పరిశ్రమను తిరిగి తెరిచేందుకు చేస్తున్న ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేయూత నివ్వాలని, సహజ వాయువు సరఫరాకు అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులు సాధించేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ నరాల సత్యేంద్రప్రసాద్ పాల్గొన్నారు.